క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు కృష్ణమూర్తి మనవడు, డాక్టర్ నవీన్ స్వాతి కుమారుడు ముక్క నివేశ్ (20) ఆదివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని సంతాపం తెలిపారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు... వన్నారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి సంపత్ జీపీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనిమీద ద్విచక్ర వాహనంపై గట్టుదుద్దెనపల్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. సంపత్ ఎడమ కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం కాగా స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హార్వెస్టర్ పైనుంచి పడి డ్రైవర్‌కు ..

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామ పంచాయతీ పరిధి చర్లపల్లి గ్రామంలో సోమవారం హార్వెస్టర్ పైనుంచి పడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గ్రామంలో వరికోస్తుండగా యంత్రంలో గడ్డి ఇరుక్కుంది. గడ్డిని తొగించే క్రమంలో డ్రైవర్ నారాయణ అదుపుతప్పి కింద పడిపోయాడు. చేతికి బలమైన గాయం కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డ్రైవర్ డాక్టర్ మధ్య వాగ్వాదమైనట్లు సంబంధికులు తెలిపారు.

ఆర్డీవోకు ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని 203 రేషన్‌షాపు డీలర్ రేవెల్లి సుప్రియ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడిందని, రేషన్ షాపు లైసెన్స్ రద్దు చేయాలి హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబుకు గుర్రపు రాధిక సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రేషన్‌షాపు నిర్వహణలో ఇటీవల పది క్వింటాళ్ల ఇరవై కిలోల బియ్యం లెక్కలు చూపకుండా అవకతవకలకు పాల్పడ్డారని, సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేసి కేసు నమోదు చేశారని తెలిపారు. గతంలో డీలర్ షాపు ఎంపిక సందర్భంగా అప్పటి తహసీల్దార్‌కు బంధువు కావడంతో నిబంధనలు పాటించలేదని, అట్టి డీలర్‌షాపుపై ఎంపికపై కోర్టులో కేసు వేశామని, రేషన్ లైసెన్స్ రద్దు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అదృశ్యం కేసు

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి సోమవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని హనుమడ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి మార్చి 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందిస్తున్న సిబ్బంది

శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామానికి చెందిన మార్క అజయ్ గంగాకావేరి సీడ్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సీడ్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.నాలుగు లక్షల చెక్కు అందజేశారు. జనరల్ మేనేజర్ బాలగంగాధర్‌రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజిరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల పంచాయితీ..

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లిలో బోనాల వేడుక గ్రామంలోని రెండు వర్గాల మధ్య గొడవకు దారి తీసింది. ఇరువర్గాలు అధికారులను ఆశ్రయించగా సోమవారం సమస్యకు పరిష్కారం చూపారు. గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల జాతర గ్రామంలో రెండు వర్గాలు జరుపుకుంటుండగా ఆలయ ప్రవేశం వద్ద సమస్య రావడంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో వారు పోలీసులు, రెవెన్యూ అధికారులను సంప్రదించగా ఆలయ పూజారి చెప్పినట్లు ఇరువర్గాలు నడుచుకోవాలని సూచించడంతో సమస్య సద్దుమణిగింది.

వైభవంగా కల్యాణోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



చొప్పదండి: కోనేరుపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు



చిగురుమామిడి: ముదిమాణిక్యంలో పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

గన్నేరువరం: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర) సందర్భంగా సోమవారం అర్చకుడు శ్రీమణిశంకర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై తిలకించారు. మంగళవారం శకటోత్సవం, బుధవారం రథోత్సవం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోవాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిని అంజయ్య, కారోబార్ మాధవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు వందల ఏళ్ల చరిత్ర గల వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో చెన్నమాధవుని వంశస్తులు తిరిగి ఆలయపునరుద్ధరణ పనులపై దృష్టి సారించగా వేదపండితుడు విష్ణువర్ధనాచార్యుల ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు పూర్తి చేశారు. ఈసందర్భంగా రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నమాధవుని పవనసుత రాజు, కలకొండ వెంకటలింగారెడ్డి, కాసు వేణుగోపాల్ రాజు, బత్తిని ఎల్లగౌడ్, అశోక్, రామేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు చేశారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కుల బాబు, మాజీ సర్పంచ్ జక్కుల రవీందర్, సన్నీళ్ల వెంకటేశం, జర్నలిస్టు రఘునాథరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోయిని రమేశ్, ముదిరాజ్ సంఘం కార్యదర్శి జక్కుల మల్లేశం, స్వామి, కనకయ్య, సమ్మయ్య, యాట రాజయ్య, చంద్రమౌళి, పర్శరాములు, వెంకటేశ్వర్లు, కనకయ్య, నందు, ఆంజనేయులు పలువురు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి



రామడుగు: మొక్కలకు నీరు పోస్తున్న రైతులు



జమ్మికుంట: ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఆల్ ఇండియా కోర్ కమిటీ మెంబర్ శ్రీనివాస్‌రావు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో సోమవారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్, బీసీఐ, నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పీయు మేనేజర్ నిఖిత మాట్లాడుతూ.. ఏటా ఏప్రిల్ 22న ప్రపంచ వ్యాప్తంగా ధరిత్రి దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకొని కాలుష్యం తగ్గించేందుకు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో క్షేత్ర సిబ్బంది రామారావు, వనిత, రమేశ్, సాయికుమార్, శేఖర్ గ్రామరైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వాములవ్వాలి

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ కోరారు. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ప్లాస్టిక్ సంచులు వద్దు- బట్ట సంచులు ముద్దు అనే నినాదంతో సైకిల్‌పై తిరుగుతూ వాడవాడలా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ మూలంగా పర్యావరణం దెబ్బతింటుందని, భవిష్యత్ తరాల బాగు కోసం ప్లాస్టిక్ నివారణకు అందరూ కృషి చేయాలన్నారు.

ఎలక్ట్రిక్ బైక్‌లతో పర్యావరణ పరిరక్షణ

జమ్మికుంట: పెట్రోల్, డీజిల్ వాహనాలతో కాలుష్యం పెరిగిపోతుందని, ఎలక్ట్రిక్ బైక్‌లతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ బైక్‌లు వినియోగించాలని ఈ బైక్స్ ఆల్ ఇండియా కోర్ కమిటీ మెంబర్ రచ్చ శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలో మల్లికార్జున ఎలక్ట్రానిక్ ఏడీఎంఎస్ బైక్ షోరూంను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పొల్యూషన్ పెరిగిపోతుండటంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని, ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రభుత్వాలే ప్రమోట్ చేస్తున్నాయని తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయవచ్చన్నారు. సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ చెరుకు పైడయ్య, రఘు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్

కొనుగోలు కేంద్రాల తనిఖీ





బొమ్మనపల్లిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ శ్రీధర్, మానకొండూర్: కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

చిగురుమామిడి: రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన రూ.2,203 మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ పీడీ పీ. శ్రీధర్ కోరారు. మండలంలోని బొమ్మనపల్లి, చిగురుమామిడిలోని ఐకేపీ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రతి రైతుకు చెందిన ధాన్యం బస్తాలను తప్పని సరిగా రికార్డు చేసి ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వెంట డీపీఎం సీహెచ్ ప్రవీణ్, ఏపీఎంలు మారపల్లి రాజేశ్, మట్టేల సంపత్, సీసీలు వెంకటమల్లు, సత్యనారాయణ, వీఏఓలు రజిత, నిర్మల, చైతన్య రైతులు, హమాలీలు ఉన్నారు.

మానకొండూర్: మండలంలోని రంగపేట, వెల్ది, వేగురుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ డీఆర్‌డీవో పి. సునీత, ఏపీఎంలు సంతోష్, నిరంజన్ సోమవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో తాగునీటి వసతి, టార్పాలిన్లు, హమాలీలు, ట్రాన్స్‌పోర్టు, గన్నీ సంచుల గురించి అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు ఆపకుండా వెంట వెంటనే తూకం వేయాలని సూచించారు. తేమశాతం సరిగా ఉండేలా తాలు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఏ సమస్య ఉన్నా సెంటర్ నిర్వాహకులు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారంకు చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు ఫజల్ రహమాన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోలు భిక్షపతి, వెంకటేశ్, రామన్నపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గొర్నకొండ రాజు హైదరాబాద్‌లో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బల్మూరి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ నాయకులు సలీంపాషా, మహేందర్ తదితరులున్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

శంకరపట్నం: మండలంలోని ధర్మారం ప్రాథమిక పాఠశాలలో సోమవారం మౌలిక వసతుల కల్పనకు భూమిపూజ నిర్వహించినట్లు ఏఈ తిరుపతి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా తాగునీటి సౌకర్యం కోసం ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్కూల్‌లో విద్యుత్ సౌకర్యం, కిటికీల మరమ్మతులకు నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు భారతి, హెచ్‌ఎం రాజిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.



భూమిపూజలో ఏఈ తిరుపతి, టీచర్లు

మండల సభ వాయిదా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం వాయిదా పడింది. ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అధ్యక్షతన మండల సమావేశం ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలుతో పాటు ఎంపీటీసీ సభ్యుల కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు.

ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్‌నే గెలిపించాలి

కరీంనగర్: భారతదేశంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీనే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి, రాష్ట్రానికి అవసరం కనుక ప్రజామిత్ర గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిందన్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రజామిత్రతో పాటు అన్ని ప్రజాసంఘాలు, కుల సంఘాలు కలిసి పనిచేయాలని కోరారు. దేశ అభివృద్ధి, ప్రజల క్షేమాన్ని ఆకాంక్షించే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. సమావేశంలో ప్రజామిత్ర నాయకులు సిగిరి శ్రీధర్, తరాల్ల నర్సయ్యలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్‌లో సోమవారం రాత్రి పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నామని, వారి నుంచి రూ.33,310 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నర్సరీ దగ్ధం

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని కూరగాయల నర్సరీ సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. నర్సరీపై వేసిన గ్రీన్ మ్యాట్‌తోపాటు అందులోని ట్రేలు కాలి బూడిదయ్యాయి. మధ్యాహ్నం వేళ ప్రమాదం జరగడంతో క్షణాల్లో మంటలు వ్యాపించి మొత్తం కాలిపోయింది. సుమారు రూ.3 లక్షల నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. దట్టమైన మంటలు, నల్లటి పొగలు రావడంతో రాజీవ్ రహదారి వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలు ప్రమాదాన్ని తిలకించారు.



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ, సీఐ రవి, కేంద్ర బలగాలు, బీఎల్‌వోలు

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సైదాబాద్, కోరపల్లి, విలాసాగర్, తనుగుల గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ రవి, పోలీసులు, కేంద్ర బలగాలు, బీఎల్‌వోలు సిబ్బంది పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ఆరోపణలు చేయొద్దు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు

వీణవంక: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసత్య ఆరోపణలు మానుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌కుమార్ గెలుపు కోసం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంట్ పరిధిలో ఎంపీ సంజయ్ రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని, పొన్నం ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బండి గెలుపు కాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి నర్సింహరాజు, నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, బూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

హుజూరాబాద్: ముదిరాజ్‌ల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ-ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ సోమవారం ప్రకటనలో కోరారు. దివంగత ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా క్షేత్రస్థాయిలో బీసీ కమిషన్ ద్వారా ముదిరాజ్‌ల జీవన విధానం, స్థితిగతులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన అనంతరమే బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చుతూ జీవో తెచ్చిన సమయంలో రజక సంఘం నాయకులు అడ్డుకున్నారని, ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గన్నేరువరం: గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓడినా ఐదేళ్లుగా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్న బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన సతీమణి బోయినపల్లి మాధవి కోరారు. మండలంలోని జంగపల్లి, ఖాసీంపేట, పారువెల్ల, గన్నేరువరం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేస్తున్న ప్రదేశంలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అంతకుముందు ఖాసీంపేట గ్రామ శ్రీ మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ ఎంపీగా ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లల్లో కొత్తల పనులు చేయలేదని, ఎన్నికలు వస్తేనే బండి సంజయ్‌కి ప్రజలు గుర్తుకు వస్తారని అన్నారు. గుడికి, బడికి నిధులు తేలేదని, ఎప్పుడు ప్రజల మనోభావాలతో బండి సంజయ్ రాజకీయం చేస్తారని, వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్-మనోహరాబాద్ రైల్వేలైన్, కరీంనగర్ స్మార్ట్ సిటీకి రూ.వెయ్యికోట్లు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని వివరించారు. విద్యావంతుడు, అభివృద్ధి చేసే నాయకుడు వినోద్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు నవీన, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఆంజనేయులు, తిరుపతిరెడ్డి, సుధాకర్, లక్ష్మణ్, రవీందర్, ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోయినపల్లి మాధవి